ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



వైసీపీ దొంగలు దొరికిపోయారు

వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ఆ నేరాన్ని టీడీపీపైకి నెట్టేద్దామనుకున్న వైసీపీ నేతల కుట్రను పోలీసులు తిప్పికొట్టారు.అంబేడ్కర్‌ను అడ్డుపెట్టుకుని రాజకీయ మంటల్లో చలికాచుకుందామనుకున్న నారాయణస్వామి సలహా విన్న ఈ ఘటన ముఖ్య పాత్రధారి సర్పంచ్ గోవిందయ్యను జైలుకు పంపించారు.ఎస్సీల దేవుడు అంబేడ్కర్ విగ్రహానికి అపకారం చేద్దామనుకున్న గోవిందయ్యను కఠినంగా శిక్షించాలి.బేసిక్ నాలెడ్జ్ కూడా లేని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఈ విషయంపై మాట్లాడుతున్న మాటలు జోకర్‌ను తలపిస్తున్నాయి.రూ.3,500 కోట్లు లిక్కర్‌స్కామ్‌లో నిందితుడైన నారాయణస్వామికి ధైర్యముంటే మాపై అటాక్ చేయాలి.అంబేడ్కర్ ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు లేఖ రాసిన వైసీపీ ఎంపీకి నిజాయితీ ఉంటే ఈ ఘటన వెనకున్నవారిని కూడా శిక్షించాలని కోరాలి.

- మీడియా సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యేలు వీఎం థామస్, జగన్మోహన్, మురళీమోహన్, నెలవల విజయశ్రీ, యార్లగడ్డ వెంకట్రావు

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

వాట్ ఆర్ యూ టాకింగ్ ఎస్పీ?



దేవళంపేట ఘటనపై ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడిన తీరు ఏ మాత్రం సరికాదు.దళిత సమాజాన్ని అవమాన పరిచేలా మాట్లాడిన ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలి.అరెస్టు చేసిన గోవిందయ్యను విడుదల చేయాలి. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకుడు సతీష్ నాయుడు,సర్పంచ్ గోవిందయ్య మధ్య అంబేడ్కర్ విగ్రహంపై వివాదం వుంటే ఈ కేసులో గోవిందయ్యను ఇరికించారు. ఇది స్వల్ప ఘటన అని ఎస్పీ ఎలా అంటారు? వాట్‌నాన్సెన్స్ ఆర్‌యూ టాకింగ్ ఎస్పీ? ఇదిలాగే కొనసాగితే ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులనూ డిజిటల్ బుక్‌లో ఎక్కిస్తాం.రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ లేదు. పచ్చచొక్కాలు వేసుకుని పనిచేస్తున్నారు.

- మీడియా సమావేశంలో వైసీపీ నేతలు నారాయణ స్వామి, సుధాకర బాబు



వెన్నెల్లో విహరించిన వైకుంఠనాథుడు

తిరు మాడవీధుల్లో పౌర్ణమి వెలుగుల్లో శ్రీవారు మంగళవారం తన ప్రియవాహనం గరుడుడిపై విహరించారు. ప్రతినెలా పౌర్ణమిరోజున నిర్వహించే గరుడ సేవలో భాగంగా.. మంగళవారం రాత్రి మలయప్పస్వామిని విశేష అభరణాలు, పుష్పాలతో అలంకరించారు. తర్వాత గరుడ వాహనంపై కొలువుదీర్చి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మాడవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు వాహనసేవ కదులుతున్న క్రమంలో అతి దగ్గరగా ఓ శునకాన్ని గుర్తించిన అధికారులు, సిబ్బంది కంగారుపడ్డారు. వెంటనే దూరంగా తరిమారు. సిబ్బంది నిర్లక్ష్యంపై అధికారులు ఆగ్రహించినట్టు సమాచారం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

స్వగ్రామంలో సీఎం

- కుటుంబ సభ్యులతో కలిసి సోదరుడి సంవత్సరీకానికి హాజరైన చంద్రబాబు



సంవత్సరీక పూజా కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, ఇందిర, నారా లోకేశ్, గిరీష్, రోహిత్

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సోదరుడి సంవత్సరీకానికి హాజరైన సీఎం చంద్రబాబు మూడు గంటలపాటు స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెలో గడిపారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనికోసం ఆయన ఉండవల్లిలోని నివాసం నుంచి హెలిప్యాడ్‌లో బయలుదేరి మంగళవారం ఉదయం 11.20 గంటలకు ఎ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన 11.30 గంటలకు నారావారిపల్లెలోని ఇంటికి వచ్చారు. ఇంట్లో నారా రామ్మూర్తి నాయుడికి విస్తర (11వనెల బట్టలు పెట్టడం) కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 12.25 గంటలకు సీఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేశ్, రామ్మూర్తి నాయుడి సతీమణి ఇందిర, కుమారులు నారా గిరీష్, నారా రోహిత్, సీఎం సోదరి హైమావతి, ఇతర కుటుంబ సభ్యులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవినాయుడు రామ్మూర్తి నాయుడి ఘాట్‌కు చేరుకుని నివాళులర్పించారు. అక్కడ్నుంచి 12.55 గంటలకు ఇంటికి బయలుదేరారు. సీఎం ఇంటి ముందున్న వందలాది మంది ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. దాదాపు అరగంట పాటు ప్రజలతో ఉన్నారు. అనంతరం ఇంటిలోపలకు వెళ్లిన ఆయన మధ్యాహ్నం 2.10 గంటలకు హెలిప్యాడ్‌కు బయలుదేరారు. ఆ సమయంలోనూ ఇంటి ముందున్న బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎ.రంగంపేట నుంచి హెలికాప్టర్‌లో సీఎం, మంత్రి లోకేశ్ ఉండవల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎం సతీమణి నారా భువనేశ్వరి రోడ్డు మార్గంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదు వెళ్లారు.



రామ్మూర్తి ఘాట్ (సమాధి) వద్ద హారతి ఇస్తున్న నారా లోకేశ్, గిరీష్, రోహిత్. చిత్రంలో చంద్రబాబు, ఇతర కుటుంబ సభ్యులు



నారా రామ్మూర్తినాయుడి ఘాట్



బాగా పనిచేశారు

- కలెక్టర్‌కు సీఎం అభినందన



సీఎం చేతుల మీదుగా స్కోచ్ అవార్డు అందుకుంటున్న కలెక్టర్

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టులో భాగంగా ఢిల్లీకి చెందిక స్కోచ్ సంస్థ గోల్డెన్ పురస్కారాన్ని ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్ అందుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం నారావారిపల్లె నుంచి ఎ.రంగంపేట హెలిప్యాడ్ వద్దకు వచ్చిన సీఎంను కలెక్టర్ కలిశారు. మరోసారి సీఎం చేతుల మీదుగా స్కోచ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బాగా పనిచేశారంటూ కలెక్టర్‌ను చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, తిరుపతి కమిషనరు మౌర్య, ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ భూమనా.. మీ హయాంలో

శేషవస్త్రాలు ఎక్కడికి పోయాయి?

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): 'వారంరోజుల పాటు స్వామిపై ఉన్న శేషవస్త్రాలు మీ హయాంలో బయటకు ఎలా పోయాయి భూమన కరుణాకరరెడ్డి గారూ?' అని టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మంగళవారం తిరుమల ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చిన కారణంగా కొన్ని శేషవస్త్రాలు ఎవరికి చేరకూడదో వారికి చేరాయని భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. అవి ఎంతమందికి చేరాయో ఆ లెక్కలు కూడా త్వరలో బయటపడతాయంటూ.. దీనిపై కూడా విచారణ చేయిస్తామని భానుప్రకాష్ అన్నారు. అర్చకులు, శేషాద్రిస్వామి వంటి వారు మృతి చెందిన తర్వాత దహన క్రియలు జరిగిన అనంతరం సంప్రదాయానుసారం అక్కడికి వెళ్లి పరివట్టం కట్టే పద్ధతి ఉందని తెలిపారు. ధర్మారెడ్డి కుమారుడు చనిపోయినప్పుడు కూడా ఇలాగే జరిగిందని, అక్కడ భూమన కరుణాకరరెడ్డి కూడా ఉన్నారని చెప్పారు. శ్రీవారి ప్రతిష్ఠ, తిరుమల పవిత్రత దిగజారేలా మాట్లాడడం మానుకోవాలని భూమనకు హితవు చెప్పారు.

నేటినుంచి సహకార సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాజ్ హోటల్ వేదికగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సదస్సు జరగనుంది. సహకార రంగ బలోపేతంతో ఆర్థిక వృద్ధిని పెంపొందించడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి అశీష్‌కుమార్ భుటానియాతో పాటు వివిధ రాష్ట్రాల సహకార శాఖ ఉన్నతాకారులు,ప్రతినిధులు హాజరవుతున్నారు.ఇప్పటికే సుమారు 70 మంది ప్రతినిధులు నగరానికి చేరుకున్నారు. సదస్సు సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న సంస్కరణలు, సహకార రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఏపీ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ జైన్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌ల పర్యవేక్షణలో జరిగే సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.



సహకార సదస్సుకు సిద్ధమైన తాజ్ హోటల్‌లో వేదిక

● అప్పీల్ చేసుకున్న దివ్యాంగులకు

నేటి నుంచి వైద్య పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనర్హులుగా నోటీసులు అందుకుని.. అప్పీలు చేసుకున్న దివ్యాంగ పింఛనుదారులకు బుధవారం నుంచి మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. వీరి అర్హతను పునఃపరిశీలించనున్నారు. ఎంతో మంది అనర్హులు దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలపై.. అప్పట్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనర్హులుగా గుర్తించి నోటీసులు ఇచ్చారు. తాము అర్హులమైనా నోటీసులు ఇచ్చారంటూ పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాంటి వారు 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అలా అప్పీలు చేసుకున్న వారికి తిరుపతిలోని రుయా స్పత్రి, శ్రీకాళహస్తి, గూడూరు ఏరియా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్యనిపుణులచే బుధవారం నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా ఆస్పత్రుల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలంటూ మంగళవారం టెలికాన్ఫరెన్సులో అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంచానికే పరిమితమైన వారిని 108, 104 అంబులెన్సుల ద్వారా ఆస్పత్రికి తరలించాలన్నారు. ఆర్థోకు సంబంధించి 30 మంది, వినికిడిలోపమున్న 30, మానసిక వైకల్యం కలిగిన 20, దృష్టిలోపం ఉన్న 20మందిని పునఃపరిశీలించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఆయా లబ్ధిదారులకు నోటీసులు అందించి నిర్దిష్ట సమయంలో హాజరయ్యేలా చూడాలన్నారు.

● భూం ఫట్

కొత్తగా సర్వే నెంబర్లు సృష్టించారు. అటవీశాఖ పరిధిలోని భూములను రెవెన్యూలో ఉన్నట్లు చూపించారు. పక్కరాష్ట్రానికి చెందిన వారికి పట్టాలిచ్చేశారు. ఇలా 250 ఎకరాల భూంఫట్‌కు పాల్పడ్డారు. రెవెన్యూ ఉద్యోగులా.. మజాకా అనిపించుకున్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

రెవెన్యూ మాయాజాలం



అటవీ భూములకూ పట్టాలు

ఎన్నికల సమయంలో చక్రం తిప్పిన సిబ్బంది

సత్యవేడు మండలం వానెల్లూరు పంచాయతీలో సర్వే నెంబర్ 197/1లో సుమారు 252.16 ఎకరాల అటవీ భూములున్నాయి. వీటిని ఆరు భాగాలుగా విభజించి, కొత్తగా సర్వే. ఖాతా నెంబర్లు తయారు చేసి రెవెన్యూ భూములుగా రికార్డులలోకి ఎక్కించేశారు. 197/1 స్థానంలో 197/1ఏ, 197/1బీ, 197/1సీ, 197/1డీ, 197/1ఈ, 197/1ఎఫ్ అని సర్వే నెంబర్లు తయారు చేసి చెన్నైకు చెందిన ఆరుగురి పేర్లపై రికార్డులను సృష్టించారు. గుట్టుచప్పుడు కాకుండా మ్యుటేషన్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ అసలు సంగతి బయట పడడంతో విషయం ఉన్నతాధికారులకు చేరింది. ఇక్కడి రెవెన్యూ అధికారుల తీరుతో జిల్లా ఉన్నతాధికారులూ అవాక్కయిపోతున్నారు. ప్రస్తుతం ఆ సర్వే నెంబర్లను రెడ్ మార్క్‌లో పెట్టినట్లు సమాచారం. ఇందులో ఎవరి పాత్ర ఎంత మేరకు ఉందన్న విషయంపై విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

ఏ పేరు మీద ఎంతెంత?

పీ.శ్రీధరన్ (తండ్రిపేరు పద్మనాభన్) పేరు మీద సర్వే నెంబర్ 197/1ఏ లో 50 ఎకరాల 34 సెంట్లు. అమృతవర్షిణి (తండ్రి పేరు రాజ్ ఖన్నా) పేరుమీద సర్వే నెంబరు 197/1బీ లో 50 ఎకరాల 34 సెంట్లు. నవీన్ రాజ్‌ఖన్నా (తండ్రి పేరు రాజ్‌ఖన్నా) పేరు మీద సర్వే నెంబర్ 197/1సీ లో 50 ఎకరాల 34 సెంట్లు. అనురాధ జయకుమార్ (తండ్రిపేరు విజయన్ రాజశేఖర్) పేరుమీద సర్వే నెంబర్ 197/1డీలో 50 ఎకరాల 34 సెంట్లు. లతజయ్‌కుమార్ (తండ్రిపేరు జయకుమార్) పేరు మీద సర్వే నెంబర్ 197/1ఈ లో 50 ఎకరాల 34 సెంట్లు. ఆశాసురేష్ పేరుమీద సర్వే నెంబర్ 197/1ఎఫ్ లో 46 సెంట్లకు రికార్డులు సృష్టించారు. ఈ భూములను ఏకంగా అమ్ముకునేందు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

ఎప్పుడు జరిగింది?

2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ అటవీ భూములకు నకిలీ పట్టాలను సృష్టించినట్లుగా తెలుస్తోంది. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించేందుకు నాలుగు నెలల కిందట మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై సంబంధిత అధికారి క్షేత్ర స్థాయిలో విచారించగా ఈ వ్యవహారం బయటపడింది. దీంతో అప్రమత్తమయిన ఆ అధికారి జిల్లా అధికారులకు నివేదిక అందించినట్లు సమాచారం.

జరిగిందిలా..

ఈ ఘటనలో గతేడాది బదిలీల్లో భాగంగా ఎన్నికల నిర్వహణ విధుల నిమిత్తం వచ్చిన కీలకాధికారిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దార్లకు భూములకు సంబంధించి పట్టాలు జారీ చేయడం, మ్యుటేషన్లు చేయడం తదితరాలపై అధికారాలు ఉండవు. ఆ అధికారి డిజటల్ సైన్‌ను ఫోర్జరీ చేసి ఇంటి దొంగలే ఈ పని చేసి ఉంటారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో దళారీల కనుసన్నల్లో మెలుగుతున్న కొందరు సిబ్బందిపాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల్లో డీకేటీ భూములకు సంబంధించిన రికార్డులు కనిపించడం లేదంటూ సమాచారం. దీనిపై ఇటీవల కార్యాలయంలో ఉన్నతాధికారులు విచారణ జరపడం గమనార్హం.

అక్రమాలపై చర్యలు తీసుకోండి

తమ పంచాయతీలో చోటు చేసుకుంటున్న భూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయికి వానెల్లూరు వాసులు వినతులు సమర్పించారు. తమ గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ మాయపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆర్డీవోను కలిసి కోరారు.

గోవింద ధామం పనుల పరిశీలన



గోవింద ధామం కమిటీ సభ్యులు,ఎమ్మెల్యే నానితో మంత్రి లోకేష్

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వర్ణముఖినది తీరాన గోవిందధామం నిర్మాణ పనులను మంత్రి నారాలోకేష్ పరిశీలించారు. మంగళవారం ఉదయం ఆయన సుబ్రమణ్యంనాయుడి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్ళి తిరిగి వస్తూ మార్గంలోని ఆగి గోవిందధామం పనులను చూశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని నేతృత్వంలో దాతల సహకారంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని లోకేష్‌కు కమిటీ సభ్యులు వివరించారు. చంద్రగిరి అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తామని మంత్రి తెలిపారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ కెపీఎస్ వాసు, తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, సంగీతం విశ్వనాథం, జగన్మోహన్ నాయుడు, వేణు, పంచాయతీ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఘటనపై నిరసన



అంబేడ్కర్ భవన కమిటీ సభ్యుల నిరసన

పాకాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఛీఫ్ జస్టిస్ బిఆర్.గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక అంబేడ్కర్ భవనం కమిటీ సభ్యులు డిమాండు చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడాలని, విద్యావంతులపై పరోక్ష ప్రత్యక్ష దాడులను మానుకోవాలని కోరారు. అంబేడ్కర్ భవన కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు

పాకాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపులపై స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు మాట్లాడుతూ ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. తగ్గిన వస్తువుల ధరల గురించి వివరించారు. కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఆర్వీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి విజయలక్ష్మీదేవి, అధ్యాపకులు తులసీరామరెడ్డి, భరణీకుమార్, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో జీఎస్టీపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. దామలచెరువు జడ్పీహైస్కూల్‌లో ఎంఈవో బాబ్జీ జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలతో కుదించుకుపోయిన రహదారి



ఇరుకుగా మారిన ఊట్లవారిపల్లె - కృష్ణాపురం రోడ్డు

పాకాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పాకాల-దామలచెరువు నుంచి ఊట్లవారిపల్లె మీదుగా వెళ్లే కృష్ణాపురం రోడ్డు పలుచోట్ల ఆక్రమణలకు గురైయింది. ఊట్లవారిపల్లె, రామిరెడ్డిగారి ఇండ్లు వద్ద రోడ్డు మార్జిన్‌లో కట్టడాలు వెలిశాయి. 45 అడుగుల రోడ్డు ఒక్కోచోట 15-20 అడుగులకు పరిమితమైంది. దీంతో ఈమార్గంలో ఎదురుగా వాహనం వస్తే పక్కకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. ఊట్లవారి పల్లెలో, చెరువు కట్టపై ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రామిరెడ్డిగారి ఇండ్లు సమీపంలో మామిడిగుజ్జు పరిశ్రమ ఉండడంతో లారీలు, కంటైనర్లు, ట్రాక్టర్లు ఈ మార్గంలో తరచూ వెళ్తుంటాయి. నన్నూరివారిపల్లె, రామిరెడ్డిగారి ఇండ్లు, అబ్బానాయుడు ఇండ్లు, నల్లగుట్టఇండ్లు, పచ్చిపాలపల్లె, నేలదానిపల్లె, కృష్ణాపురం, జంగాలపల్లె వాసులు పాకాల నుంచి ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తారు.

పాఠశాల భవనానికి రూ.10లక్షలు మంజూరు



వర్క్ ఆర్డర్ అందిస్తున్న చంద్రమోహన్‌రెడ్డి

తిరుపతిరూరల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పుదిపట్లలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈనిధులకు సంబంధించి వర్క్ ఆర్డర్‌ను మంగళవారం తన చాంబర్‌లో గ్రామ ఎంపీటీసీ శ్రీకాంత్‌కి అందజేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పాత భవనం శిథిలావస్థకు చేరుకుంటుండడంతో నిధులు మంజూరు చేశామన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పాఠశాలల్లో విద్యుత్ సమస్య ఎదురుకాకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. నాయకులు ఉపేంద్రరెడ్డి, కరమలవల్లి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నారు. చంద్రగిరిలోని ప్రభుత్వ బాల, బాలికల ఉన్నత పాఠశాలలో ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారిని లలిత కుమారి మాట్లాడుతూ జీఎస్టీ రేట్లు తగ్గింపుతో చేకూరిన ప్రయోజనాన్ని అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. పోటీల్లో విజేతలు సాయివిశాల్, శశాంక్, హిమవర్షిని, శశిలకు బహుమతులు ప్రదానం చేశారు.

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నిత్యకట్ల కైంకర్యాలనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై మాడ వీధుల్లో గోవింద నామస్మరణల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, అర్చకులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.11.85 లక్షలు

డక్కిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.11.85 లక్షలు లభించినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. హుండీ ద్వారా సమ ర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. రూ.11,85,259నగదు, బంగారం 0.138 కిలోలు, వెండి 0.522 కిలోలు భక్తులు కానుకలు రూపంలో హుండీలో వేసినట్లు ఈవో తెలిపారు.

స్వర్ణముఖి నదిలో యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో పడి ఉదయ్‌కుమార్(35) అనే యువకుడు మృతి చెందాడు. నాయు డుపేట పట్టణంలోని బీడీ కాలనీలో నివాసం ఉంటున్న ఉదయ్ కుమార్ సోమవారం ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. మంగళవారం సాయంత్రం స్వర్ణముఖినది ఒడ్డున ఉదయ్‌కుమార్ దుస్తులు ఉండటంతో అదే ప్రాంతంలో గాలించడంతో నదిలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తర లించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఉదయ్‌కుమార్ ప్రమాదవ శాత్తు మృతి చెందాడా.. లేక ఇంకేమైన కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలావస్థలో పీహెచ్‌సీ వసతి గృహాలు




నివాసయోగ్యంగా లేని పీహెచ్‌సీ సిబ్బంది వసతి గృహాలు

రామచంద్రాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కమ్మపల్లి పీహెచ్‌సీ సిబ్బంది వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల వ్యవస్థ ఏర్పడిన తొలినాళ్లలో అప్పటి ఎమ్మెల్యే ముద్దుకృష్ణమనాయుడు చొరవతో పీహెచ్‌సీ పక్కా భవనాలతో రూపుదిద్దుకుంది. 1984లో వైద్యుల కోసం మూడు, నర్సులకు 3, డ్రైవర్లకు 3, ఇతర సిబ్బంది కోసం ఐదు భవనాలను నిర్మించారు. అప్పట్లో సిబ్బంది ఈ గృహాల్లో నివసించేవారు. నిరంతరం వైద్యసేవలు అందించేవారు. కొన్నాళ్ల తరువాత సిబ్బంది తమ నివాసాలను తిరుపతికి మార్చడంతో భవనాలు క్రమేపీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆస్పత్రి భవనం చిన్నపాటి వర్షాలకు లీకేజీ అయ్యేది. 2016 నుంచి 19 వరకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉన్న చిన్నబాబు దాతలసాయంతో ఆస్పత్రికి మర్మతులు చేయించారు. తర్వాత సిబ్బంది వసతిగృహాలు అలాగే ఉండిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వసతిగృహాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.






సీఎంకు నేతల స్వాగతం

నారావారిపల్లెలో మంగళవారం జరిగిన తన సోదరుడు రామ్మూర్తినాయుడి సంవత్సరీక కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు పులివర్తి నాని(చంద్రగిరి), ఆరణి శ్రీనివాసులు(తిరుపతి), యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ



నారావారిపల్లెలో మంగళవారం తన పర్యటన ముగించుకుని తిరిగి పయనమైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి వీడ్కోలు పలుకుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం



సూళ్లూరుపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం మహా చండీ యాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండ పంలో అమ్మవారి ఉత్సవమూర్తి విగ్రహం ఏర్పాటు చేసి వేదపండి తుల మంత్రోచ్ఛరణల నడుమ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. నెల్లూరుకు చెందిన వేణుంబాక రమణారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నిత్యాన్నదానానికి విరాళం



శ్రీకాళహస్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా భీమునిపాడుకు చెందిన కుప్పన్నగారి రామాంజనేయరెడ్డి రూ.50,100 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి సేవలో ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ చైర్మన్



శ్రీకాళహస్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్ చైర్మన్ పీవీఆర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

907మంది విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



ఏర్పేడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజెస్ ఇండియా సంస్థ ఏర్పేడు మండలంలోని పది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం బ్యాగులను పంపిణీ చేసింది. ఎస్‌వోఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమారస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుసంధానంగా విజ్ఞానగిరిపై కొలువైన కుమారస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పలు రకాల అభిషే కాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు దర్శించుకున్నారు.

గరుడోత్సవంలో కంగారు పెట్టిన శునకం



శునకాన్ని తరుముతున్న సిబ్బంది

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం రాత్రి గరుడవాహన సేవలో ఓ శునకం అధికారులు, సిబ్బందిని కంగారు పెట్టించింది. మాడవీధుల్లో శునకాల సంచారం నిషేధం. ఒకవేళ శునకాలు కనిపించినా ఎప్పటికప్పుడు హెల్త్ విభాగం పట్టుకుని తిరుపతికి తరలించాల్సి ఉంటుంది. ఇటీవల తిరుమలలోని జనసంచారంలో తరుచూ శునకాలు కనిపిస్తునే ఉన్నాయి. తాజాగా, మంగళవారం రాత్రి జరిగిన గరుడవాహనసేవ జరుగుతున్న సమయంలోనూ కనపించింది. ఆలయం ముందు వాహనసేవ ముందుకు కదులుతున్న క్రమంలో అతిదగ్గరగా శునకం రావడం గమనార్హం. గుర్తించిన అధికారులు, సిబ్బంది శునకం ఎలా వచ్చిందంటూ కంగారుపడిపోయారు. దూరంగా తరిమారు. సిబ్బంది నిర్లక్ష్యంపై అధికారులు ఆగ్రహించినట్లు సమాచారం.



విద్యార్థుల మానవహారం

గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్యాంగ్‌రేప్ కేసులో ముగ్గురు నిందితులను కఠినంగా శిక్షించాలని చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు తాండవ మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు వందలాది మంది విద్యార్థులతో కలిసి నగరంలో ర్యాలీ చేశారు. గాంధీ సర్కిల్ వద్ద మానవహారాన్ని నిర్వహించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుల తరఫున న్యాయవాదులు వాదించకూడదని విజ్ఞప్తి చేశారు. హయగ్రీవ పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల పూజలు



కొబ్బరికాయలు కొడుతున్న వైసీపీ నాయకులు

పాకాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విడుదల కావాలని కోరుకుంటూ వైసీపీ నాయకులు మంగళవారం కొబ్బరికాయలు కొట్టారు. ఆనందగిరి వళ్లీదేవసేనసమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామివారి ఆలయంలో పూజలు చేసి 516 కొబ్బరి కాయలు కొట్టారు. ఆయనకు త్వరగా బెయిల్ రావాలని, ఆరోగ్యం బాగుండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్

● సుమారు రూ 20 లక్షల ఆస్తినష్టం

వడమాలపేట,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరిగింది. మంగళవారం ఉదయం వడమాలపేట సబ్ స్టేషన్ దగ్గరలోనే లైన్ ట్రిప్ అయి సరఫరా ఆగిపోయింది. వెంటనే సబ్ స్టేషన్‌లో డేంజర్ బెల్ మోగడం తోపాటు, సిగ్నెల్ వ్యవస్థలో డిమ్ అండ్ డిప్‌గా అప్రమత్తతపై సూచిస్తుంది. సిగ్నల్ ఆధారంగా 11 కే.వీ.ట్రిప్ కావడాన్ని గమనించని సిబ్బంది వీటిపై దృష్టి పెట్టకపోవడంతో ఒక్కసారిగా హై వోల్టేజ్ సరఫరా రావడంతో స్థానిక ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల్లో కంప్యూటర్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు కాలిపోయాయి. పెద్ద శబ్దం రావడంతో అధికారులు, ప్రజలు భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు పెట్టారు. పరిసరాలలోని షాపులలోని ఫ్రిడ్జ్‌లు, విద్యుత్ మీటర్లు మాడిపోయాయి. సుమారుగా 20 లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్లుగా తెలుస్తోంది.

సంక్షేమ హాస్టళ్లన్నీ మూత

వసతి లేక ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులు



మూతపడిన బీసీ బాలుర వసతి గృహం

తడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్షేమ హాస్టళ్లు అన్నీ మూతపడ్డాయి. విద్యార్థులు లేరనే కారణంతో వాటిని మూసివేశారు. తడలో బీసీ బాలుర, ఎస్సీ బాలుర వసతి గృహాలు ఉండగా, మాంబట్టులో ఒక బీసీ బాలుర వసతి గృహం ఉంది. మాంబట్టులోని వసతిగృహం అద్దె భవనంలో నడుస్తుండగా, తడలోని రెండు హాస్టళ్లకు సొంత భవనాలు ఉన్నాయి. ఎనిమిదేళ్ల క్రితం ఎస్సీ బాలుర వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని మూసివేశారు. గత విద్యా సంవత్సరంలో తడ వసతి గృహంలో 60 మంది, మాంబట్టులో సుమారు 50మంది విద్యార్థులు వసతి పొందినట్లుగా రికార్డులు చెబుతున్నాయి. మాంబట్టు వసతి గృహ అధికారి అనారోగ్యంతో మరణించడంతో దానికి ఇన్‌చార్జిని నియమించారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో వసతి గృహాన్ని మూసివేశారు. ఇక తడలోని బీసీ వసతి గృహంలో రూ.3.50 లక్షలు వెచ్చించి ఆధునిక మరుగుదొడ్లు, నీటి వసతి వంటి వసతులు కల్పించారు. ఇక్కడ ఉన్న అధికారి బదిలీ కావడంతో సత్యవేడు మండలానికి చెందిన అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడా విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఈ వసతి గృహాన్ని సైతం అధికారులు మూసివేశారు.

రైల్వేస్టేషన్‌లో నీడ కరువు


- ప్లాట్‌ఫాం నిర్వహణ అధ్వానం
- ఎండ, వానతో ప్రయాణికుల అవస్థలు




రైల్వేస్టేషన్‌లోని కొళాయి చుట్టూ పిచ్చిమొక్కలు - గడ్డి పెరిగిపోయి షెల్టర్ లేని ప్లాట్‌ఫాం

నాయుడుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు వసతులు లేవు. పట్టణ పరిసర ప్రాంతాలతో పాటు సమీపంలో మేనకూరు సెజ్ ఉండటంతో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజుకు సుమారు 800 నుంచి 850 మంది ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. తద్వారా రోజుకు రూ.80వేల నుంచి రూ.90 వేల వరకు ఆదాయం వస్తుంది. స్టేషన్‌లోని మూడు ప్లాట్‌ఫాంలు ఉండగా, ప్రతిరోజు దాదాపు పాతిక రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్లాట్‌ఫాంలపై గడ్డి మొలిచిపోయింది. తాగునీటి కొళాయిల వద్ద చిన్నపాటి పొదలుగా ఏర్పడడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ప్లాట్‌ఫాంపై గడ్డి పెరిగిపోయి ఉండటంతో ప్రయాణికులు రైళ్లు ఎక్కేటప్పుడు, దిగే సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్లాట్‌ఫాంపై లైట్లు కూడా లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణికుల అవస్థలు పడుతున్నారు. గడ్డి కాళ్లకు తగలుకుని కొంతమంది కింద పడి గాయాలపాలైన సందర్భాలు ఉన్నాయి. ఇక రైల్వేస్టేషన్ కార్యాలయ ప్రాంతంలో మాత్రమే షెల్టర్ ఉంది. ప్లాట్‌ఫాంలపై షెడ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు వేచి ఉండడానికి నీడ కూడాలేదు. ఎండ, వానతో అవస్థలు తప్పడంలేదు. ఇదిలా ఉండగా ప్లాట్‌ఫాం చివరి భాగాలు మందుబాబులకు నిలయంగా మారాయి. కాస్త చీకటి పడితే మద్యం తాగేవారు ప్లాట్‌ఫాం చేరిపోతున్నారు. స్టేషన్‌లో ప్రయాణికులకు రక్షణ కరువైంది. తరచూ చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల ప్లాట్‌ఫాంపై నిరీక్షిస్తున్న ప్రయాణికుల నుంచి రెండు సెల్‌ఫోన్లు అపహరించారు. అలాగే ఓ ఉపాధ్యాయుడిని దుండగులు కత్తితో పొడిచిన ఘటన కలకలం సృష్టించింది. ఉన్నతాధికారులు స్పందించి రైల్వేస్టేషన్ నిర్వహణపై దృష్టి పెట్టి ప్రయాణికులకు తగిన వసతులు కల్పించడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు ఆర్‌పీఎఫ్ సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

మున్సిపల్ భవనం పూర్తికి లోకేశ్ హామీ


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఆగిపోయిన తిరుపతి మున్సిపల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తెలిపారు. నారావారిపల్లెకు వచ్చిన మంత్రిని సోమవారం రాత్రి డిప్యూటీ మేయర్ కలిశారు. మున్సిపల్ భవనం దుస్థితిపై ఫొటోలతో సహా వినతిపత్రం అందజేసి, దాని పూర్వాపరాలను వివరించారు. ప్రస్తుతం ప్రసూతి ఆస్పత్రి భవనం వద్ద మున్సిపల్ కార్యకలాపాలు జరుగుతున్నాయని, ప్రజావసరాలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. పీజీఆర్ఎస్ సమయంలో ప్రజలు బయట వేచి ఉండాల్సి వస్తోందని, సీవోసీ బిల్డింగ్ నిర్మాణం పూర్తి చేసేలా తగు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి విచారణ చేసి త్వరగా పూర్తయ్యేలా చేస్తానని హామీ ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

12న గార్లపాటి పురస్కారాల ప్రదానోత్సవం


మాట్లాడుతున్న దామోదర్‌నాయుడు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 12న ఆదివారం ఎయిర్‌బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో గార్లపాటి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు ఆచార్య గార్లపాటి దామోదర్ నాయుడు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సాహితీవేత్తలకు, ఉత్తమ రైతులకు గార్లపాటి పురస్కారాలు 2019 నుంచి ప్రతి సంవత్సరం అక్టోబరు 12న ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. 2025 సంవత్సరానికి నందివెలుగు ముక్తేశ్వరరావు, మూరిశెట్టి గోవిందు, డాక్టర్‌మన్నవ గంగాధర ప్రసాద్, డాక్టర్ సురేంద్ర రొడ్ల, ఆచార్య కట్టమంచి మహాలక్ష్మి, తారపతి, అయ్యప్ప నాయుడికి ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆచార్య మేడసాని మోహన్, డాక్టర్ లింగుట్ల రమేష్‌నాథ్‌లు ఆత్మీయ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆముదాల మురళి, వేమూరి జయరాం ప్రసాద్, మల్లేశ్వరరావు, కిట్టన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ తొలి వీసీకి ఘన నివాళి


ప్రొఫెసర్ గోవిందరాజులు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ తొలి వీసీ ఆచార్య గోవిందరాజులుకు బోధనేతర ఉద్యోగుల సంఘం ఘన నివాళి అర్పించింది. ఆచార్య గోవిందరాజులు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మంగళవారం వారు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బోధనేతర ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ గుర్రంకొండ, నెల్లూరు సుబ్రమణ్యం మాట్లాడుతూ.. యూనివర్సిటీ అభివృద్ధికి వీసీగా ఆచార్య గోవిందరాజులు గొప్ప కృషి చేశారని కొనియాడారు. బోధనేతర ఉద్యోగ సంఘం ఉపాధ్యక్షులు కోటగారం మురళి, సహాయ కార్యదర్శి ముత్తువేలు, కోశాధికారి గురుప్రసాద్, మీడియా కో-ఆర్డినేటర్ మనోజ్ కుమార్ సింగ్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలం

తిరుపతి(జీవకోన), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు కావాల్సిన ఉచిత విద్య, వైద్యం అందించడంలో సఫలీకృతులయ్యారన్నారు. చంద్రబాబు మద్యం తయారీలో నెంబర్ వన్ అనిపించుకున్నారని ఆయన విమర్శించారు.

బొంతాలమ్మ ఆలయంలో ఘనంగా పుష్పయాగం


పుష్పయాగంలో బొంతాలమ్మ

తిరుపతి(జీవకోన), అక్టోబరు 7(ఆంధ్ర జ్యోతి): తిరుపతి కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ ప్రాయశ్చితం అమ్మవారికి శాంతి హోమం, అభిషేకం నిర్వహించారు. తదుపరి పుష్పయాగం చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల భర్తీకి చర్యలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల భర్తీకి చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ ప్రయత్నించింది. ఈ విషయమై వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుతో పాటు రాష్ట్ర ఉన్నత విద్యామండలి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల భర్తీకి చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, మంత్రి లోకేష్‌కు టీఎన్ఎస్ఎఫ్ కృతజ్ఞతలు తెల్పింది. టీఎన్ఎస్ఎఫ్ ఎస్వీయూ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్ నాయుడు, గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు 21 వరకు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఈనెల 21వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్.విశ్వనాథరెడ్డి వెల్లడించారు. నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ, అర్హతలు, మరిన్ని వివరాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్, నవోదయ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోను లేదా 86888 88802/ 93999 76999 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

మానవ జీవన దిక్సూచి రామాయణం

● సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి


వాల్మీకి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న వీసీ కృష్ణమూర్తి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రామాయణం మానవ జీవన దిక్సూచి అని సంస్కృత యూనివర్సిటీ వీసీ కృష్ణమూర్తి పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వీసీ పుష్పాంజలి ఘటించిన అనంతరం మాట్లాడారు. మనిషికి జీవిత కర్తవ్యాన్ని రామాయణం ఉపదేశిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ దక్షిణామూర్తిశర్మ, అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, సంస్కృతి విభాగ డీన్ సత్యనారాయణాచార్య, సాహిత్య ఆచార్య రంగనాథన్, నిర్వాహకులు పరిమిత పాండా, అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రంగస్థలి కళాకారులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ ఆస్పత్రి కూడలిలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు హనుమంతరావు, కళాకారులు చంద్రబాబు నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, హరినాథ్, సురేష్ స్వామి, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


రవిశంకర్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సివిల్ ఇంజనీరింగ్ పరిశోధకులు బి.రవిశంకర్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. ఎక్స్‌పెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ మెకానికల్ అండ్ డ్యూరబిలిటీ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లాష్ బేస్డ్ జియోపాలిమర్ కాంక్రీట్ బ్లెండెడ్ విత్ జీజీబీఎస్ అండ్ లైమ్ క్యూర్డ్ ఎట్ ఏంబియంట్ టెంపరేచర్ అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ప్రొఫెసర్ డీవీ ప్రసాదరావు పర్యవేక్షణలో ఈ పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ రాజమాణిక్యం తెలిపారు.

పీసీసీఎఫ్‌ను కలిసిన విశ్రాంత అటవీశాఖ ఉద్యోగులు


పీసీసీఎఫ్‌కు పుష్పగుచ్చాలు అందజేస్తున్న విశ్రాంత అటవీశాఖ ఉద్యోగులు

మంగళం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టు పీవీ చలపతిరావును మంగళవారం ఏపీ విశ్రాంత ఫారెస్టు ఆఫీసర్ అసోసియేషన్ తిరుపతి విభాగ సభ్యులు తెలుగు గంగ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. శ్రీనివాసశాస్త్రి, రాఘవయ్య, విశ్వేశ్వరయ్య, రామదాసు, చంద్రశేఖర్, సుధాకర్, రమణ, రాజగోపాల్, మనోహర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శతకలశాభిషేకం


రామచంద్ర పుష్కరిణిలో సీతారాముల ఉత్సవర్లు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం అష్టోత్తర శతకలశాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. పౌర్ణమిని పురస్కరించుకుని సీతారాములు, లక్ష్మణుడు ఉత్సవమూర్తులను ఆలయ మందిరంలో కొలువుదీర్చారు. 1008 కలశాలను స్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించి, కలశ పూజ విశేషంగా నిర్వహించారు. అనంతరం కలశ జలాలతో ఉత్సవర్లకు అభిషేకాలు చేసి కర్పూర హారతులు సమర్పించారు. ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవర్ల తిరుమాడవీధుల ఊరేగింపు కనులపండువగా జరిగింది. ఉత్సవర్లు రామచంద్ర పుష్కరిణికి చేరుకుని ఉద్యానవనంలో కొలువుదీరి కర్పూర హారతులు స్వీకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకుని పునీతులయ్యారు.

అలరించిన గజేంద్ర మోక్షం హరికథా గానం

రామచంద్ర పుష్కరిణిలో మంగళవారం సాయంత్రం టీఎం రమ్యకృష్ణ హరికథా గానం అలరించింది. శ్రీమద్ భాగవతంలోని గజేంద్రమోక్షంలో మొసలి నుంచి విష్ణువు అనుగ్రహంతో ఏనుగు బయటపడే సన్నివేశాలను వివరించారు. వయోలిన్‌తో దేవేంద్ర, తబలాతో గోపాల్, శృతితో ప్రమీల సహకరించారు. కార్యక్రమాన్ని ప్రోగ్రామ్ అసిస్టెంట్ పద్మ పర్యవేక్షించారు.

సీజేఐపై దాడి దారుణం


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సీజేఐ గవాయ్‌పై దాడికి నిరసనగా ఎస్వీయూలో పలు విద్యార్థి, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మెయిన్ గేట్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ముందు బహుజన ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 75 ఏళ్ల పై బడిన స్వాతంత్ర్య దేశంలో ఏకంగా సీజేఐపై దాడి జరగడం దారుణమన్నారు. డిప్యూటీ రిజిస్ట్రార్ దామ్లా నాయక్ మాట్లాడుతూ.. ఇటువంటి దాడులను అందరూ ఖండించాలన్నారు. బహుజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సంగీతం సుబ్రమణ్యం మాట్లాడుతూ.. సీజేఐపై దాడికి పాల్పడిన వారిని దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు పుణ్యమూర్తి మాట్లాడుతూ.. సీజేఐపైనే ఇలాంటి దాడి జరిగితే దేశంలో సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పద్మనాభం, రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో..

ఎస్ఎఫ్ఐ, నేషనల్ లా స్టూడెంట్ యూనియన్ విద్యార్థి సంఘాలు సీజేఐపై దాడికి నిరసన కార్యక్రమాన్ని ఎస్వీయూ మేనేజ్‌మెంట్ కాలేజీ వద్ద చేపట్టారు. ఎస్ఎఫ్ఐ నేత అశోక్, లా స్టూడెంట్ యూనియన్ నేత సుందరాజు మాట్లాడుతూ.. సీజేఐపై దాడి మన దేశానికే అవమానకరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీజేఐపై దాడి చేసిన న్యాయవాదిని అరెస్ట్ చేయాలి


జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై అవమానకరమైన పద్ధతిలో సనాతనవాది, రాజ్యాంగంపై గౌరవం లేని వ్యక్తి, సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ దాడి చేయడం అమానుష చర్య అని ప్రజాసంఘాల నాయకులు ఖండించారు. స్థానిక బాలాజీకాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఉదయం ప్రజాసంఘాల నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మహాత్మ జ్యోతీరావు పూలే విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ నుంచి కోర్టు ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారతదేశం అధ్యక్షులు పి.అంజయ్య, అంబేద్కర్ భవన్ చైర్మన్ పరమశివం, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, డాక్టర్ ఎం.ప్రసాదరావు, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఘటనపై రాష్ట్రపతి స్పందించి దాడికి పాల్పడిన రాకేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు చరిత్రలో ఏ ప్రధాన న్యాయమూర్తికి జరగని అవమానం జరిగిందని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.గోవిందయ్య, ఏ.సుబ్రమణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, పద్మనాభరెడ్డి, విజయలక్ష్మి, జయచంద్ర, మునిరత్నం, ధనశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యంపై బుధవారం నుంచీ రెండు రోజుల పాటు పద్మావతి మహిళా యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా పీఎం ఉష ఆర్థిక సహకారంతో సైకాలజీ, సోషియల్ వర్క్, ఉమెన్ స్టడీస్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. బెంగళూరులోని నిమ్‌హాన్స్‌కు చెందిన డాక్టర్ శేఖర్, డాక్టర్ సంజీవ్‌కుమార్ అవగాహన కల్పిస్తారు. ఇందులో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, డీన్ వాణి తదితరులు పాల్గొంటారు.

10న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ ఆఫీసులో ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు జాబ్ మేళా మేళా ప్రారంభం కానుంది. పేటీయం, అపోలో ఫార్మసీ, టాటా ఎలక్ట్రానిక్స్, స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్ తదితర సంస్థలు ఈ మేళాలో పాల్గొంటాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ చదువుకున్న వారు అర్హులు. 15 నుంచీ 35 వేల రూపాయల దాకా నెలవారీ వేతనం ఉంటుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్వీయూ మీడియా డీన్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.

పెంచిన పనిగంటల బిల్లును రద్దు చేయండి


పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పని గంటల విధానాన్ని రద్దు చేసి, 8 గంటల విధానాన్ని కొనసాగించాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు జి.బాలసుబ్రమణ్యం, వి.హేమలత డిమాండ్ చేశారు. ఇందు కోసం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన ధర్నా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పటిష్టంగా వున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు మార్పిందన్నారు. ఇందులో 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 13 గంటలుగా మార్చిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని అమలు చేయడానికి క్యాబినెట్‌లో తీర్మానం చేసిందని మండిపడ్డారు. కార్మికుల శ్రమను దోచుకోవడానికి బీజేపీ, టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చారని వారు ధ్వజమెత్తారు. ఈ పార్టీలకు భవిష్యత్తులో తగిన గుణపాఠం చెపుతామని వారు హెచ్చరించారు. నాయకులు టి.సుబ్రమణ్యం, జయచంద్ర, వేణుగోపాల్, బుజ్జి, మాధవ్, సుజాతమ్మ, దాసు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నైతిక, ఆధ్యాత్మికతల మేళవింపు రామాయణం


సదస్సులో ప్రసంగిస్తున్న రామాయణం హరినాథరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నైతిక, ఆధ్యాత్మికతల మేళవింపు రామాయణం అని రామాయణం హరినాథరెడ్డి పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం తిరుపతిలోని పద్మావతి డిగ్రీ కాలేజీల్లో రామాయణంపై ఒక్క రోజు అంతర్జాతీయ అంతర్జాల సదస్సును చేపట్టారు. పద్మావతి కాలేజీ తెలుగు విభాగం - సింగపూర్, మలేషియా తెలుగు సంఘాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. రామాయణం హరినాథరెడ్డి మాట్లాడుతూ రామాయణం చదివితే తల్లిదండ్రుల వాత్సల్యం అర్థమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ రత్నాకరుడుగా ఉన్న సామాన్యుడు రామనామ మంత్ర జపంతో వాల్మీకిగా మారడం రామనామ గొప్పదనమన్నారు. తెలుగు విభాగాధిపతి కృష్ణవేణి మాట్లాడుతూ రాముని జీవన మార్గాన్ని ఈ తరం అనుసరించడానికి రామాయణం తోడ్పడుతుందన్నారు. అధ్యాపకులు కస్తూరి, శోభ, అన్నమ్మ, పద్మిని, విజయకుమారి, జయశ్రీ, శిరీష, 25 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి లాక్రోస్ పోటీలకు ఎంపిక


మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న లాక్రోస్ క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), అక్టోబర్ 7(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి లాక్రోస్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి మంగళవారం అభినందించారు. ఈ నెల 4, 5తేదీల్లో కర్నూలులో జరిగిన ఫస్ట్ సౌత్‌జోన్ సీనియర్ లాక్రోస్ చాంపియన్‌షిప్ 2025-26లో శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. దీంతో ఈనెల 28నుంచి 30వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హతసాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ క్రీడాకారులైన కె.శశిరేఖ, ఈ.సౌమ్య, ఎస్.పూజితలకు మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

వడ్రంగి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతున్న కుప్పాచారి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వడ్రంగి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంస్థ కార్యదర్శి వెలిగరం కుప్పాచారి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గౌరవాధ్యక్షులుగా పి.బలరామిరెడ్డి, అధ్యక్షులుగా కేవీ రత్నం ఆచారి, సభ్యులుగా జీఆర్ బాబు, దేవరాజులు, మురళి, బాషా తదితరులను నియమించినట్లు తెలిపారు.





ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి

అవును.. వీళ్లు బతికే ఉన్నారు!



మానవత్వమే సిగ్గుపడే దృశ్యం ఇది. తిరుపతి రుయా ఆసుపత్రికి ఎదురుగా ఇస్కాన్ రోడ్డులోని బస్టాప్‌లో బతికున్న శవాల్లా పడివున్నారు వీరంతా. ఎవరో తెలీదు. ఎక్కడి నుంచి ఎలా వచ్చారో తెలీదు. ఎప్పుడొచ్చి ఈ నీడకు చేరారో ఏమో.. మూలుగుతూ ముక్కుతూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు. మొన్న ఆరుగురు. నిన్న ఐదుగురు. ఈరోజు రాత్రికి నలుగురు మిగిలారు. వెళ్లిపోయారో, చచ్చిపోయారో తెలీదు. దూసుకుపోయే వాహనాలు.. నడచిపోయే మనుషులు.. ఎవరికీ పట్టని ఈ ప్రాణమున్న శవాలకు మంగళవారం సందెచీకటి వాలేవేళ మందుపూస్తూ, అన్నం పెడుతూ, నీళ్లు తాగిస్తూ అలిపిరి అమ్మగా పేరుపడ్డ సుజాత కనిపించారు. ఈరోజు కన్నుమూసిన వ్యక్తికి పూలమాలవేసి, దణ్ణం పెట్టుకుని ఆమె సాగనంపారు. దివ్యక్షేత్రమైన తిరుమలకు తొలిమెట్టు అయిన అలిపిరిలో ఇది సాధారణ దృశ్యం. పవిత్ర భావనతో శ్రీనివాసుడి దగ్గరకు పయనమయ్యేవారి మనసు వికలమయ్యే చిత్రం. దేవుడిమీద భారం వేసి అలిపిరికి చేరుకుని ఇలా కన్నుమూస్తున్నవారికి జానెడు నీడ, పిడికెడు ముద్ద, రోగానికి మందు ఇచ్చే విశాల హృదయం టీటీడీకి కలిగితే బావుణ్ను!

– ఆంధ్రజ్యోతి, తిరుపతి



సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం :రూ.4.16 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,773

తలనీలాలు సమర్పించినవారు: 29,100

పిరమిడ్ పార్టీకి ఎన్నికల కమిషన్ షోకాజు నోటీసులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా వార్షిక ఆడిట్, ఎన్నికల ఖర్చు వివరాలను రాష్ట్రఎన్నికల సంఘానికి సమర్పించకపోవడం వల్ల భారత ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షోకాజ్ నోటీసులు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఈ నెల 14వ తేదీ లోపు వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అన్ని రకాల ఆధారపత్రాలతో సహా రాతపూర్వకంగా వివరణ అందజేయాల్సి ఉంటుందన్నారు.

మాజీ ఆర్డీవోకు రెండ్రోజుల పోలీస్ కస్టడీ

చిత్తూరు లీగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మాజీ ఆర్డీవో మురళిని సీఐడీ కోర్టు రెండ్రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించారు. మదనపల్లెలో జరిగిన ఫైల్స్ దహనం కేసులో గతనెల 19వ తేదీన మురళిని సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మురళిని పోలీస్ కస్టడీకి అనుతించాలంటూ సీఐడీ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు పూర్తయ్యాక.. మురళిని బుధ, గురువారాల్లో పోలీసుకస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి షేక్ బాబా జాన్ ఆదేశాలు జారీ చేశారు.

'పల్లినేని' కుటుంబానికి లోకేశ్ పరామర్శ



సుబ్రహ్మణ్యం నాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి లోకేశ్

పాకాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దివంగత టీడీపీ సీనియర్ నేత, డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడి కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఉదయం గడ్డంవారిపల్లెకు చేరుకున్నారు. సుబ్రహ్మణ్యం నాయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం భార్య మునిలక్ష్మి, కుమార్తెలు రేవతి, మేఘన, తల్లిదండ్రులను పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుబ్రహ్మణ్యం నాయుడు పార్టీకి చేసిన సేవలను శ్లాఘించారు. ఈ సందర్భంగా అక్కడ గ్రామస్తులను పలకరించారు. వారి నుంచి అర్జీలను స్వీకరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామరిస్తున్న మంత్రి

13 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● కారు సీజ్ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

మంగళం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-పీలేరు రహదారిలో మంగళవారం ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 13 ఎర్రచందనం దుంగలును స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో రామకొండారెడ్డికి అందిన సమాచారం మేరకు.. మంగళవారం తెల్లవారుజాము నుంచి పూతలపట్టు-పీలేరు రహదారిలో పులిచెర్ల వద్ద అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉదయం 10.30గంటలకు పులిచెర్ల వద్ద ఏపీ 39 ఎల్ జెడ్ 9951 నెంబరు గల కారు వేగంగారావడాన్ని అధికారులు గుర్తించారు. కారును ఆపేందుకు ప్రయత్నించగా.. వేగంగా వెళ్లిపోయింది. దీంతో వాహనాన్ని వెంబడించారు. డ్రైవర్ గుడిపల్లి గ్రామం సమీపంలో కారు ఆపి పారిపోయాడు. అధికారులు కారును పరిశీలించగా 13 ఎర్రచందనం దుంగలున్నాయి. పట్టుబడిన వాహనం, దుంగల విలువ రూ.18.64 లక్షలు ఉంటుందని ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో శశికుమార్, ఎఫ్‌బీవో చంద్రబాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

మూగజీవాలకు 'సూపర్' సేవలు



వీసీసీ భవనం

తిరుపతిరూరల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పశు వైద్య రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. వివిధ వ్యాధులను గుర్తించడమే కాకుండా ఆధునిక పద్ధతుల్లో చికిత్సనూ అందిస్తున్నారు. ఇలాంటి వినూత్న వైద్య సేవలకు కేంద్రంగా నిలుస్తోంది ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని పశు వైద్య చికిత్స సముదాయ(వీసీసీ)విభాగం. పశువులకు వచ్చే ఎన్నో వ్యాధులకు ఇక్కడ చక్కని పరిష్కారం చూపుతున్నారు.



నేటి నుంచి జాతీయ సదస్సు

వీసీసీ ఆధ్వర్యంలో శాస్త్రీయపరమైన పశువిజ్ఞానాన్ని, అనుభవాలను విద్యార్థులకు అందించేందుకు బుధవారం నుంచి రెండ్రోజులపాటు కళాశాల ఆడిటోరియంలో క్లినికల్ కేస్ వెటర్నరీ స్టూడెంట్స్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాం. ఇందులో 14టెక్నికల్ సెషన్స్ ఉంటాయి. వివిధ ఆస్త్రాల నుంచి యూజీ,పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొంటున్నారు. సదస్సుకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల క్లినికల్ ఎక్స్‌పోజర్, నైపుణ్యత ప్రదర్శనకు చక్కని సదస్సు వేదికవుతుంది.

– డాక్టర్ వి.వైకుంఠరావు, వీసీసీ హెడ్

అబ్బురపరిచే ఆధునిక వైద్యం

వీసీసీలో అధునాతన పరికరాలతోపాటు ఎక్స్‌రే యూనిట్, ఆపరేషన్ థియేటర్, వ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రయోగశాల, పెద్ద, చిన్న జంతువుల ఇన్‌పేషంట్ సౌకర్యం, ఆక్వాలిఫ్ట్ లాంటి సదుపాయాలున్నాయి. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకే కాదు గుర్రాలు, చిరుతలు, సింహాలు, ఏనుగులు, పక్షులకు కూడా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నారు. పెంపుడు జంతువులకు రక్తపరీక్షలు, ఎక్స్‌రే, శస్త్రచికిత్సలు, ఇతర పరీక్షలకు రుసుము చెల్లించాలి. వీసీసీలో చేస్తున్న కృషికి జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. 2008లో ఈవిభాగం టీచింగ్ వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌గా ఏర్పాటై 2019లో వీసీసీగా మార్పు చెందింది. తిరుపతి తాతయ్యగుంటలోని సీటీవెటర్నరీ ఆసుపత్రి, తొండవాడలో వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లోనూ పశువైద్యసేవలు అందిస్తున్నారు. అంతేకాదు యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల క్లినికల్ శిక్షణకు ఇది ప్రధానకేంద్రంగా నిలిచింది. రాయలసీమజిల్లాల్లో పశువైద్యానికి సంబంధించి అత్యవసర కేసులకు రిఫెరల్ గానూ కీలకభూమిక పోషిస్తోంది. కేంద్రంలో రోజూవందకు పైగా ఓపీ సేవలందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



సీఎంను కలిసి వినతులు ఇచ్చేందుకు నిరీక్షిస్తున్న ప్రజలు



మానసిక వైకల్యమున్న ఈ పదేళ్ల చిన్నారి పేరు ప్రత్యూష. నాయుడుపేట పట్టణం. తల్లిదండ్రులు లేని ఆమె.. పెద్దనాన్న సంరక్షణలో ఉంది. 90 శాతం వైకల్యమున్నా పూర్తి పెన్షన్ అందడం లేదు. దీనిపై నారావారిపల్లెలో సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేయగా.. రూ.15 వేల పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

జనం వెతలు వింటూ..

● పరిష్కారానికి హామీలిచ్చిన సీఎం

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు మంగళవారం ఉండింది మూడు గంటలే. ఆయన వచ్చింది సోదరుడి సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొనేందుకు. ఇంత బిజీ షెడ్యూల్‌లోనూ ఆయన తనకోసం వచ్చిన జనం వెతలు ఓపిగ్గా ఉన్నారు. అరగంటకుపైగా వారితో మాట్లాడారు. వినతులు స్వీకరించారు. అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. కాగా చంద్రబాబుకు ఎ.రంగంపేట హెలిప్యాడ్ వద్ద స్వాగతం.. వీడ్కోలు పలికారెందరో. వీరిలో సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, చంద్రగిరి, తిరుపతి, నగరి, శ్రీకాళహస్తి, జీడీనెల్లూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, డాక్టర్ థామస్, నెలవల విజయశ్రీ, ఆదిమూలం, మురళీమోహన్, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు హేమలత, సుగుణమ్మ, నరసింహయాదవ్, డాలర్స్ దివాకర్‌రెడ్డి, రవినాయుడు, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివం, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖరరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, పరసారత్నం, మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అలాగే, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్, డీఐజీ షిమోషీ వాజ్పేయి, ఎస్పీ సుబ్బరాయుడు, డీపీవో సుశీలాదేవి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో కర్ణాటక ముఠా

● చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలకు పాల్పడేది కర్ణాటక గ్యాంగ్ అని పోలీసులు గుర్తించారు. వీరు నగరాన్ని షెల్టర్ జోన్‌గా చేసుకుని చైన్ స్నాచింగ్‌ల నుంచి ద్విచక్ర వాహనాలు చోరీ చేయడం, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో మహిళలు, వృద్ధుల బ్యాగులు ఎత్తుకెళ్లి ఆభరణాలు, నగదు కొట్టేస్తున్నారని తెలిసింది. వీరు ఆరు నెలలకు ఒకసారి తాము ఎంచుకున్న ప్రాంతాలకు వెళ్లి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ ముఠాల కోసం జిల్లా పోలీసులు ఆరేడు నెలలుగా గాలిస్తున్నారు. తిరుపతిలో కర్ణాటకకు చెందిన దాదాపు 10 గ్యాంగుల సభ్యులు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెబుతున్నారు. రెండు రోజుల తిరుపతిలో క్రితం తిరుపతిలోని పోస్టల్ కాలనీలో ఒకరు.. అలిపిరి పరిధిలోని నలుగురు మహిళల మెడల నుంచి దాదాపు 186 గ్రాముల బంగారు చైన్లు లాక్కొని పరారయ్యారు. ఈ పనికి పాల్పడింది కర్ణాటక ముఠానే అని తాజాగా భావిస్తున్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతి రూరల్ పరిధిలోని చిగురువాడలో ఇద్దరు మహిళల మెడల నుంచి చైన్లు లాక్కెళ్లారు. వీరు స్థానికంగా ద్విచక్ర వాహనాలు దొంగిలించి, ఇలాంటి నేరాలకు పాల్పడుతుండటంతో పోలీసులు తొలుత స్థానికులే ఈ పనికి పాల్పడినట్లు భావించారు. కానీ, విచారణలో కర్ణాటక గ్యాంగు ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని పోలీసు వర్గాలు తెలిపాయి. మరోవైపు చైన్ స్నాచింగ్ నేపథ్యంలో వాకింగ్ వెళ్లే మహిళలు ఆందోళన చెందుతున్నారు. వాకింగ్ సమయంలో విలువైన ఆభరణాలు వేసుకెళ్లొద్దని పోలీసులూ సూచిస్తున్నారు. ఈ ముఠాపై నిఘా పెట్టామని, త్వరలోనే వారిని పట్టుకుంటామని ఓ పోలీసు అధికారి చెప్పారు.



పట్టుబడిన స్మగ్లర్లు, వాహనం, దుంగలతో ఉద్యోగులు

ఎర్రచందనం పట్టివేత

భాకరాపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్మగ్లర్లతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భాకరాపేట-తలకోన మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో పూలకుంటపల్లె రోడ్డు వద్ద నిఘా పెట్టామన్నారు. ఈక్రమంలో ఓ కారును ఆపగా తమిళనాడుకు చెందిన చందురిస్ యజుమల్లై, తరుమాన్ సామిక్కన్ అనే స్మగ్లర్లు పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. వారిని వెంబడించి పట్టుకుని కారును తనిఖీ చేయగా ఆరు ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయన్నారు. స్మగ్లర్లపై కేసు నమోదు చేసి వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించిందని ఆయన తెలిపారు. దాడిలో ఎఫ్ఎస్‌వో సలావుద్దీన్, ఎఫ్‌బీవోలు రాజేశ్ కుమార్, ప్రదీప్ చంద్, రవి, సిబ్బంది శంకర్ రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు వివరించారు.

వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకం



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని స్విమ్స్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతికి మూలస్తంభంగా నిలిచిందన్నారు. యువత వాల్మీకి జీవితాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి గురుస్వామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.



క్యూలైన్‌లో దర్శనానికి వేచిఉన్న సర్వదర్శన భక్తులు



ఆక్టోపస్ భవనం సర్కిల్ వద్ద సర్వదర్శన అదనపు క్యూలైన్‌కు అడ్డుగా పెట్టిన బారికేడ్

తిరుమలలో అదే రద్దీ

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. తమిళులు అత్యంత పెరటాశి మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. తమ స్వగ్రామాల నుంచే తిరుమలకు కాలినడకన చేరుకుని స్వామిని దర్శించుకునే సంప్రదాయం ఉంది. సెప్టెంబరు 17వ తేదీన పెరటాశి మాసం ప్రారంభమైనప్పటికీ 25వ తేదీ వరకు భక్తుల రద్దీ మోస్తరుగానే కనిపించింది. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన 24వ తేదీతో పాటు 25 తేదీలు వీఐపీల హడావుడితో కనిపించిన క్షేత్రం.. 26 నుంచి మాత్రం భక్తులతో రద్దీగా మారిపోయింది. 27 పెరటాశి రెండో శనివారంతో పాటు మరుసటి రోజు 28న గరుడవాహనం కావడంతో ఆ మూడురోజులు తిరుమల కిటకిటాలడింది. ఆ రద్దీ ఇప్పటికీ కొనసాగుతోంది. సర్వదర్శన క్యూలైను ఆక్టోపస్ భవనం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపిస్తోంది. అర్ధరాత్రి దాటాక కూడా భక్తులు క్యూలైన్‌లోకి చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత బాటగంగమ్మ ఆలయ సర్కిల్ సమీపంలోని క్యూలైన్‌కు తాళం వేయాల్సి వస్తోంది. ఇక, అదనపు క్యూలైన్ ప్రవేశమైన ఆక్టోపస్ భవనం సర్కిల్ వద్ద బారికేడ్‌ను క్యూలైన్‌కు అడ్డుగా పెడుతున్నారు. తిరిగి అర్ధరాత్రి తర్వాత భక్తులను క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు.

- 12 రోజుల్లో 8.9 లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు.
- అత్యధికంగా 4న 83,380.. 5న 83,412 మంది దర్శించుకున్నారు.
- 11 రోజుల్లో 37.32 కోట్ల హుండీ ఆదాయం లభించింది.
- 3,33,234 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.



క్యూలైన్‌లోకి వెళ్లేందుకు పరుగులు తీస్తున్న భక్తులు

పుత్తూరు వార్తలు

నకిలీ మద్యం తయారీ సూత్రధారికి
చంద్రబాబు ఆశీస్సులు: సీపీఐ

వరదయ్యపాళెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీలో ప్రధాన సూత్రధారి అయిన జయచంద్రారెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులు ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హరినాథరెడ్డి ఆరోపించారు.. వరదయ్యపాళెంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల తంబళ్లపల్లెలో నకిలీ మద్యం తయారీ గోడౌన్‌ను ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ప్రధాన సూత్రధారిగా జయచంద్రారెడ్డిని గుర్తించారన్నారు. ఎక్సైజ్ శాఖలో కొరత లేకుండా సిబ్బందిని నియమించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. నిర్లక్ష్య ఫలితం
సుమారు రూ 20 లక్షల ఆస్తినష్టం

వడమాలపేట,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వడమాలపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరిగింది. మంగళవారం ఉదయం 11:30 గంటల సమయంలో వడమాలపేట సబ్ స్టేషన్ దగ్గరలోనే లైన్ ట్రిప్ అయి సరఫరా ఆగిపోయింది. ట్రిప్ అయిన వెంటనే సబ్ స్టేషన్‌లో డేంజర్ బెల్ మోగడం తోపాటు, సిగ్నెల్ వ్యవస్థలో డిమ్ అండ్ డిప్‌గా అప్రమత్తతపై సూచిస్తుంది. సిగ్నల్ ఆధారంగా 11 కే.వీ.ట్రిప్ కావడాన్ని గమనించని సిబ్బంది వీటిపై దృష్టి పెట్టకపోవడంతో సమస్య ఏలికైంది. ఒక్క సారిగా హై వోల్టేజ్ విద్యుత్ సరఫరా రావడంతో స్థానిక ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉన్న ఎలాక్ట్రానిక్ కంప్యూటర్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు కాలిపోయాయి. పేలిన పెద్ద శబ్దం రావడంతో కార్యాలయాల్లో ఉన్న అధికారులు, ప్రజలు భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు పెట్టారు. ఏమి జరుగుతుందోనంటూ ఆందోళనలకు గురయ్యారు. ఈ సంఘటనలో ప్రభుత్వ కార్యాలయాల్లోనే లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. దీనికి తోడు కార్యాకలాపాలు స్తంభించింది. అలాగే పరిసరాలలోని షాపులలోని ఫ్రిడ్జ్‌లు, విద్యుత్ మీటర్లు మాడిపోయాయి. ఈ ఘటనలో సుమారుగా 20 లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్లుగా తెలుస్తోంది. తహసీల్దార్ జరీనా విద్యుత్ అధి కారులకు సమాచారం అందించారు. తాత్కాలికంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సంఘటన పై సమగ్ర విచారణ చేయాల్సివుంది.

ఐజీసీ శిక్షణకు ఎన్‌సీసీ విద్యార్థులు

పుత్తూరు,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ (ఐజీసీ) శిక్షణకు ఎంపికైన ముగ్గురు ఎన్‌సీసీ విద్యార్థులను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అభినందించారు. హైదరాబాదులో ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు ఐజీసీ శిక్షణ జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ శిక్షణకు తమ కళాశాల నుంచి బీకామ్‌కు చెందిన శేషాద్రి, బీబీఏ గ్రూప్ విద్యార్థిని లావణ్య, బీఎస్సీ విద్యార్థి గీత ఎంపికయ్యారని వివరించారు. ఈ శిక్షణలో ఎంపికైన విద్యార్థులకు ప్రీ రిపబ్లిక్ క్యాంపునకు వెళతారని ఫైనల్‌గా ఎంపికైన వారు ఢిల్లీలో జనవరిలో జరిగే రిపబ్లిక్ దినోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు కోటేశ్వరయ్య, వాసవి పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం తొలగింపు

పుత్తూరు, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలోని తడుకు గ్రామ వీధి మలుపులో అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మంగళవారం తొలగించామని విద్యుత్ ఏఈ జయసాయి తెలిపారు. దిగువ గూళూరు గ్రామానికి చెందిన జిల్లా దళితనాయకుడు నందయ్య ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభం దారికి అడ్డుగా ఉందని గతవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన విద్యుత్ అధికారులు క్రేన్ సాయంతో స్తంభాన్ని తొలగించారు.

సీజేఐ దాడి.. దళితుల నిరసన



పుత్తూరు టౌన్, అక్టోబర్ 7(ఆంధ్రజ్యోతి): సీజేఐపై దాడిని నిరసిస్తూ పుత్తూరులోని స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద దళిత సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి అపరంజి, కోశాధికారి కుప్పయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై కోర్టు హాలులో చెప్పుతో దాడి చేయడం చాలా దారుణమని పేర్కొన్నారు. దాడికి పాల్పడ్డ న్యాయవాదిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాల సుబ్రమణ్యం, మావిల్లయ్య, రఘునాథం, గుర్రప్ప, సెల్వరాజ్, డాక్టర్ రాజేంద్ర పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ



పుత్తూరు టౌన్, అక్టోబర్ 7(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఎంపీడీవో గా శ్రీదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నగరి ఎంపీడీవోగా బాధ్యతలు ఎంపీడీవో శ్రీదేవి, పిచ్చాటూరు ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీగా పనిచేస్తూ ప్రస్తుతం పుత్తూరు ఎంపీడీవో గా పదోన్నతి పొంది, మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

సీఎంకు వీడ్కోలు పలికిన ఎమ్మెల్యే భాను ప్రకాష్



పుత్తూరు అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు సోదరుడు మాజీ ఎమ్మెల్యే దివంగత నాయకులు రామ్మూర్తి నాయుడు సంవత్సరీకంకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు, నాగరి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఘన స్వాగతం పలికారు. మంగళవారం హెలిప్యాడ్ వద్ద కలసి స్వాగతం పలికారు. నారావారిపల్లెలో జరిగినా సంవత్స రీకం కార్య క్రమంలో పాల్గొన్నారు. ఘాట్ వద్ద చేరుకుని పుష్పగుచ్చం ఉంచి నివాళులు అర్పించారు. నగరి నియోజకవర్గం అభివృద్ధి గురించి మంత్రి నారా లోకేష్ కువివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంకు వీడ్కోలు పలికిన విజయ్‌బాబు



పుత్తూరు అర్బన్: సీఎం చంద్రబాబు నాయుడు సోదరులు మాజీ ఎమ్మెల్యే దివంగత నాయకులు రామ్మూర్తి నాయుడు సంవత్సరీకం కార్యక్రమం తర్వాత తిరుగు ప్రయాణం అవుతున్న సీఎం చంద్రబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు హెలీప్యాడ్ వద్ద కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

ఏర్పేడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలో ధరలు తగ్గుతాయని పాపానాయుడుపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు జీఎస్టీ అవగాహన కార్యక్రమం జరిగింది. పంచాయతీ కార్యదర్శి మునెయ్య, అధ్యాపకులు ఉమా, రాఘవరెడ్డి, వెంకటసురేష్, శ్రీమన్నారాయణ, శంకరప్ప, సువర్ణ, అమరేశ్వరరెడ్డి, షమీర్, వైవీ రాధ, సాయితేజ, సుధాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపుపై మంగళవారం అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రమణయ్య మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వారిలో కొనుగోలు శక్తి పెరుగుతుందని వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

స్వర్ణముఖి నదిలో యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో పడి ఉదయ్‌కుమార్(35) అనే యువకుడు మృతి చెందాడు. నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీలో నివాసం ఉంటున్న ఉదయ్ కుమార్ సోమవారం ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. మంగళవారం సాయంత్రం స్వర్ణముఖినది ఒడ్డున ఉదయ్‌కుమార్ దుస్తులు ఉండటంతో అదే ప్రాంతంలో గాలించడంతో నదిలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఉదయ్‌కుమార్ ప్రమాదవశాత్తు మృతి చెందాడా.. లేక ఇంకేమైన కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం

సూళ్లూరుపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం మహా చండీ యాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తి విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. నెల్లూరుకు చెందిన వేణుంబాక రమణారెడ్డి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు.



చండీయాగంలో ఉభయకర్త రమణారెడ్డి దంపతులు

రైల్వేస్టేషన్‌లో
నీడ కరువు

- ప్లాట్‌ఫాం నిర్వహణ అధ్వానం
- ఎండ, వానతో ప్రయాణికుల అవస్థలు





రైల్వేస్టేషన్‌లోని కొళాయి చుట్టూ పిచ్చిమొక్కలు - గడ్డి పెరిగిపోయి షెల్టర్ లేని ప్లాట్‌ఫాం

నాయుడుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు వసతులు లేవు. పట్టణ పరిసర ప్రాంతాలతో పాటు సమీపంలో మేనకూరు సెజ్ ఉండటంతో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజుకు సుమారు 800 నుంచి 850 మంది ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. తద్వారా రోజుకు రూ.80వేల నుంచి రూ.90 వేల వరకు ఆదాయం వస్తుంది. స్టేషన్‌లోని మూడు ప్లాట్‌ఫాంలు ఉండగా, ప్రతిరోజు దాదాపు పాతిక రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్లాట్‌ఫాంలపై గడ్డి మొలిచిపోయింది. తాగునీటి కొళాయిల వద్ద చిన్నపాటి పొదలుగా ఏర్పడడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ప్లాట్‌ఫాంపై గడ్డి పెరిగిపోయి ఉండటంతో ప్రయాణికులు రైళ్లు ఎక్కేటప్పుడు, దిగే సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్లాట్‌ఫాంపై లైట్లు కూడా లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణికుల అవస్థలు పడుతున్నారు. గడ్డి కాళ్లకు తగులుకుని కొంతమంది కింద పడి గాయాలపాలైన సందర్భాలు ఉన్నాయి. ఇక రైల్వేస్టేషన్ కార్యాలయ ప్రాంతంలో మాత్రమే షెల్టర్ ఉంది. ప్లాట్‌ఫాంలపై షెడ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు వేచి ఉండడడానికి నీడ కూడాలేదు. ఎండ, వానతో అవస్థలు తప్పడంలేదు. ఇదిలా ఉండగా ప్లాట్‌ఫాం చివరి భాగాలు మందుబాబులకు నిలయంగా మారాయి. కాస్త చీకటి పడితే మద్యం తాగేవారు ప్లాట్‌ఫాం చేరిపోతున్నారు. స్టేషన్‌లో ప్రయాణికులకు రక్షణ కరువైంది. తరచూ చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల ప్లాట్‌ఫాంపై నిరీక్షిస్తున్న ప్రయాణికుల నుంచి రెండు సెల్‌ఫోన్లు అపహరించారు. అలాగే ఓ ఉపాధ్యాయుడిని దుండగులు కత్తితో పొడిచిన ఘటన కలకలం సృష్టించింది. ఉన్నతాధికారులు స్పందించి రైల్వేస్టేషన్ నిర్వహణపై దృష్టి పెట్టి ప్రయాణికులకు తగిన వసతులు కల్పించడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు ఆర్‌పీఎఫ్ సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.





మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట, తహసీల్దార్ కార్యాలయంలో నిలచిన వర్షపునీరు

సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపడంతో తీవ్ర ఉక్కపోత నెలకొంది. సాయంత్రానికి కారుమబ్బులు కమ్ముకుని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురడంతో పట్టణ వీధులన్నీ జలమయంగా మారాయి. జీఎన్‌టీ రోడ్డు, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో వర్షపునీరు నిలిచింది. మురుగు కాలువలు పూడిపోవడంతో చిన్నపాటి వర్షమొచ్చిన పట్టణ వీధులన్నీ జలమయంగా మారుతున్నాయి. పలుచోట్ల కాలువలు ఆక్రమణకు గురైన మురుగునీరు పారకపోవడంతో వర్షమొచ్చిందంటే ఎక్కడి నీళ్ల అక్కడే నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. ఈదురు గాలులతో కూడిన వర్షంతో విద్యుత్ సరఫరాకు సైతం అంతరాయం కలిగింది.





ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, మాజీ ఎంపీ నెలవల, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు పాశిం, విజయశ్రీ

గూడూరు, తడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని నారావారిపల్లికి విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. నారావారిపల్లిలో సీఎం సోదరుడు రామమూర్తి నాయుడు సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం, మంత్రిని పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, విజయశ్రీ కలిశారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి హేయమైన చర్య



టవర్‌క్లాక్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

గూడూరు అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై సుప్రీంకోర్టులో జరిగిన దాడి హేయమైన చర్య అని కేవీపీఎస్ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవ్యవస్థ గౌరవం కోసం ప్రజలు, సామాజిక ఉద్యమకారులందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, చంద్రయ్య, శివకుమార్, మణి, రమణయ్య, మధు, కోటేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అనాగరిక చర్య

డక్కిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమైన, అనాగరిక చర్యగా రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నర్సయ్య అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీస్తాయన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

సూళ్లూరుపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని రామకృష్ణ విద్యాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుంకర ప్రతిమ, కమ్మిరెడ్డి, శివప్రసాద్ రెడ్డి, రాధాకృష్ణన్, యారాసి గోపి తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్సీ 'బల్లి'



గూడూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి స్వాగతం పలికారు. చంద్రగిరి మండలంలోని నారావారిపల్లిలో సీఎం సోదరుడు రామమూర్తి నాయుడు సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి లోకేశ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్సీ స్వాగతం పలికారు.

క్రీడాసామగ్రి అందజేత



క్రీడాసామగ్రిని అందజేస్తున్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసరావు, సనత్‌కుమార్‌రెడ్డి, కృష్ణ, వాసుగౌడ్, భాస్కర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

వరదయ్యపాళెం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందారు. సత్యవేడు మండలం జడేరి పంచాయతీ కేవీ కండ్రిగకు చెందిన ఎం.వెంకటేశులు(35) శ్రీ సిటీ కంపెనీలో పనిచేస్తూ.. తడలో కాపురం ఉంటున్నాడు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో వరదయ్యపాళెంలో తన ద్విచక్ర వాహనంలో తడకు ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో బత్తులవల్లం ఎనమాలగుంట సమీపంలో వెళుతుండగా రహదారిపై గల గుంతలో వాహన దిగడంతో అదుపు తప్పింది. దీంతో అతడు కిందపడి గాయాలపాలయ్యాడు. అదే మార్గంలో వెళుతున్న శ్రీసిటీ ఉద్యోగులు అపస్మారక స్థితిలో ఉన్న అతడిని 108లో సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుని భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రోగులకు, సిబ్బందికి హెచ్‌ఐవీపై అవగాహన కల్పించి ర్యాలీ చేశారు.

క్వాంటమ్‌తోనే సాంకేతిక పరిజ్ఞానం

కోట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యారంగంలో సాంకేతిక నైపుణ్యాలు కావాలంటే క్వాంటమ్ వైపు దృష్టి మరల్చాలని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం క్వాంటమ్ క్రిప్టోగ్రఫి అనేబుల్డ్ అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్‌పై అధ్యాపకులు, విద్యార్థులు రీసెర్చ్ కాలర్స్‌కు అవగాహన కార్యక్రమం జరిగింది. వరంగల్ నిట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథరెడ్డి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు.

నాయుడుపేట జడ్పీ బాలుర హైస్కూల్‌కు స్వచ్ఛాంధ్ర పురస్కారం



ప్రధానోపాధ్యాయురాలు మంజులకు స్వచ్ఛాంధ్ర పురస్కారం అందజేస్తున్న డీఈవో కుమార్

నాయుడుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంలో పరిశుభ్రత పాటించడంలో నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులకు డీఈవో ఏవీఎన్ కుమార్ స్వచ్ఛాంధ్ర పురస్కారం అందజేశారు.

క్రీడలతో ఆరోగ్యం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్

గూడూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడల సాధన వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. మంగళవారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రాయల్ క్రికెట్ క్లబ్, చేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ కప్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్రికెట్ ఆడిన క్రీడాకారులు వివిధ వృత్తుల్లో, పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారని, వారిని ఒక వేదికపైకి చేర్చి క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీఆర్‌మణి, మనపాటి రవీంద్ర బాబు, మండ్ల సురేష్‌బాబు, మునిగిరీష్, పవన్, రాజేష్, దీపక్‌ఆకాశ్, నందవరం సుబ్బారావు, కిషోర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నాగరాజుకు ఎమ్మెల్యే పరామర్శ

వరదయ్యపాళెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండూరుకు చెందిన టీడీపీ నేత నాగరాజు యాదవ్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శించారు. నాగరాజు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆదిమూలం ఆస్పత్రికి చేరకుని నాగరాజును పరామర్శించారు.

మాజీ సైనికుడికి డెహ్రాడూన్ ఆర్మీ సన్మానం



శ్రీకాళహస్తి, అక్టోబరు 7(ఆంధ్ర జ్యోతి): డెహ్రాడూన్ ఆర్మీయూనిట్ డైమండ్ సెలబ్రేషన్‌లో భాగంగా దేశర క్షణకు తమ సేవలను అందించి రిటైర్డ్ అయిన మాజీ సైనికులు, వారి కుటుంబాలను సత్కరించి పుర స్కారాలను అందజేశారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి మాజీ సైనికుడు పులి శ్రీకాంత్ కుటుంబాన్ని డెహ్రా డూన్‌కు పిలిపించి ఘనంగా సత్కరిం చారు. పులి శ్రీకాంత్, లెఫ్టినెంట్ కల్నల్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జీఎస్టీపై వ్యాసరచన పోటీలు

పిచ్చాటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై మండలంలోని వెంగళత్తూరు జడ్పీ హైస్కూలులో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్ రాజు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎమ్మార్సీలో సెమ్ టు బుక్స్ ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు సరఫరా చేశారు.

గిరిజనులను వేధిస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

చిల్లకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గిరిజన కాలనీలో గిరిజనులను పేదరికాన్ని అడ్డం పెట్టుకుని అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి స్థానికులను ఇబ్బంది పెడుతున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు శ్రీనివాసులు, మస్తాన్ అన్నారు. మంగళవారం గిరిజన కాలనీలోని బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు.

నిత్యాన్నదానానికి రూ.50,100 విరాళం



శ్రీకాళహస్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా భీమునిపాడుకు చెందిన కుప్పన్నగారి రామాంజనేయరెడ్డి రూ.50,100 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కుమారస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుసంధానంగా విజ్ఞానగిరిపై కొలువైన కుమారస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ముక్కంటి సేవలో ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ చైర్మన్



శ్రీకాళహస్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్ చైర్మన్ పీవీఆర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

అధికారుల తీరు మారలేదు: మాజీ ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల తీరు మారడం లేదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సన్నిధి వీధిలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్ల వద్ద కార్లను పార్కింగ్ చేయడాన్ని పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందించి భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లలో వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

907మంది విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



ఎల్లంపల్లి ఎస్టీకాలనీలో విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న ఎస్‌వోఎస్ సిబ్బంది

ఏర్పేడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజెస్ ఇండియా సంస్థ ఏర్పేడు మండలంలోని పది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం బ్యాగులను పంపిణీ చేసింది. ఎస్‌వోఎస్ సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేద్దాం

పిచ్చాటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13, 14 తేదీల్లో పుత్తూరు పట్టణంలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేద్దామని ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆశ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వండి

రేణిగుంట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు పింఛను పెంచాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. డప్పు కళాకారులకు రెండు ఎకరాల భూమి, రైలులో ఉచిత ప్రయాణ సౌకర్యం, పింఛను రూ.4వేల నుంచి రూ.7వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఎంపీడీవో రవిచంద్రకు వినతిపత్రం సమర్పించారు.

ఉభయదారులకు గుడిమల్లం ప్రసాదాలు

ఏర్పేడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ నవరాత్రి ఉత్సవాల ఉభయదారులకు ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రసా దాలు అందజేశారు. విజయవాడకు చెందిన ఉభయదారులు వీరకుమార్, కన్యా కుమారి దంపతులను మంగళవారం ఆయన కలిసి ప్రసాదాలు అందించారు. అలాగే విజయవాడలో ఉన్న మరికొంతమంది ఉభయదారులకు ప్రసాదాలు అందిం చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పవన్ యోగేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోండి

నారాయణవనం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే ప్రత్యేక క్యాంపుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ నెల 11వ తేది శనివారం వరకు జాతీయ తపాలా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్లు, ఇన్సూరెన్స్ పాలసీలు వాటి పరిమితి, సేవింగ్స్ సర్టిఫికెట్లు, పొదుపు ఖాతాల ప్రారంభం తదితర సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.

సూపర్ జీఎస్టీపై విద్యార్థులకు పోటీలు

కేవీబీపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో రవికుమార్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీతో పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, పెన్సిళ్ల ధరలు తగ్గుతాయని చెప్పారు. కాగా వ్యాసరచన పోటీల్లో 9వ తరగతి విద్యార్థి మహీధర్, చిత్రలేఖనంలో ఆదిత్యవర్ధన్, వక్తృత్వ పోటీల్లో హాస్సీమేరీ ప్రథమ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కూనాటి సురేష్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, ప్రకాష్, బాబు, నాగరాజు, సీఆర్పీ సూపర్ తదితరులు పాల్గొన్నారు.

వసతులపై ఆరా



శ్రీకాళహస్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను మంగళవారం శ్రీకాళ హస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బృందమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

రైతుల సమస్య పరిష్కారం

శ్రీకాళహస్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం బోనపల్లి గ్రామంలో రైతుల సమస్యకు తహసీల్దారు భారతి పరిష్కారం చూపారు. సర్వే నెంబరు 204, 205లో ప్రభుత్వ భూమిబాటను కొందరు ఆక్రమించుకున్నారు. దీనిపై రైతులు తహసీల్దారు భారతికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది పోలీసు సహకారంతో అక్కడికి చేరకుని హద్దులు నిర్ణయించి బాటను ఏర్పాటు చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల్లో హర్షం

శ్రీకాళహస్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై అన్ని వర్గాల్లో హర్షాతి రేకాలు వెల్లివిరుస్తున్నట్లు జీఎస్టీ అధికారి ముక్కంటి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం జీఎస్టీపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వ హించి విజేతలకు బహుమతులు ప్రదా నం చేశారు. హెచ్‌ఎం వెంకటయ్య, ఎంపీడీవో పెంచలశ్యాహ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి గర్హనీయం



సత్యవేడులో నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ నాయకులు

సత్యవేడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడి గర్హనీయమని సత్యవేడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశులు యాదవ్ పేర్కొన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మంగళవారం భోజన విరామ సమయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మధు, మునిచంద్ర శేఖర్, జానయ్య, మునిశేఖర్, మహేష్, రాజేష్, వివానందం, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖండించిన సీపీఎం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్ధన్ పిలుపునిచ్చారు. మంగళవారం సత్యవేడులోని సీపీ ఎం కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ దాడికి పూనుకున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రమేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణాచలం, నాయ కులు తిరుమలరెడ్డి, కృష్ణయ్య, భాస్కర్, మునస్వామి, కొల్లాపురి, రాము, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ గవాయిపై దాడి రాజ్యాంగంపై దాడే



తిరుపతి అంబేడ్కర్ భవన్ ఎదుట నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

ఏర్పేడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సీజేఐ బి.రామకృష్ణ గవాయిపై దాడి రాజ్యాంగంపై దాడి అని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక తరఫున మంగళవారం తిరుపతిలోని మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం నుంచి తిరుపతి పట్టణ న్యాయస్థానాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టార్ కృష్ణ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దళితులందరూ ఐకమత్యంతో పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అంబేడ్కర్ భవన్ చైర్మన్ డాక్టర్ పరమశివన్, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య, ప్రసాదరావు, ధనశేఖర్, చెన్నకేశవ, శ్రీనివాసరావు, సురేష్, రఫీ, గోపాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సామాజిక తనిఖీ

- రూ. 42వేలు రికవరీ
- హాజరు కాని ప్రజా ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నామమాత్రంగా జరిగింది. ఈ బహిరంగ సభకు మండలంలోని ఎంపీపీ సహా ఏ ఒక్క ప్రజా ప్రతినిధి కూడా హాజరు కాలేదు. 2024 ఏప్రిల్ నుంచి 2025 సంవత్సరం మార్చి నెల వరకు జరిగిన పంచాయతీరాజ్, హౌసింగ్, ఫారెస్టు, వెటర్నరీ, స్కూల్ ఎడ్యుకేషన్, వెలుగు, సెర్ప్, చెరువు పూడికతీత పనులు, గుంటలు, కాలువలు మొత్తం 725 పనులకు గాను రూ. 7.88,93,499లు వ్యయం చేశారు. ఈ పనులపై సామాజిక తనిఖీ సిబ్బంది వారం రోజులు పాటు 28 పంచాయతీలలో 13 డీఆర్‌పీలు, 8 మంది వీఎస్‌ఏలు పనులను పరిశీలించి తనిఖీ చేశారు. జిల్లా ఉపాధి హామీ పీడీ శ్రీనివాస ప్రసాద్ అధ్యక్షతన సామాజిక బహిరంగ సభలో వివిధ పనులకు సంబంధించి కేవలం రూ.70వేలు రికవరీ, పెనాల్టీ రూ, 70149లు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోతి తదితరులు పాల్గొన్నారు.

ఓట్‌చోర్ గద్దె చోడ్ ప్రజల నినాదం కావాలి : కాంగ్రెస్

సత్యవేడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఓట్ల చోరీతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘునాథ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న 'ఓట్ చోర్ - గద్దె చోడ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మదనంబేడు, సత్యవేడు బీసీకాలనీలలో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. అనంతరం దేవళంపేట అంబేడ్కర్ విగ్రహ దహనం ఘటనలో నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ మదనంబేడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నారాయణవనానికి స్వచ్ఛ గ్రామ పంచాయతీ అవార్డు



స్వచ్ఛ అవార్డును అందుకుంటున్న సర్పంచ్, ఈవో

నారాయణవనం, అక్టోబర్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నారాయణవనం పంచాయతీకి స్వచ్ఛగ్రామ పంచాయితీ అవార్డు, అలాగే గ్రీన్ అంబాసిడర్ రవి స్వచ్ఛ వారియర్ అవార్డు అందుకున్నారు. సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డును సర్పంచ్ శారదమ్మ, ఈఓ షణ్ముగం అందుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం సంపద తయారీ కేంద్రం వద్ద పంచాయతీ సిబ్బంది కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ రవి, లక్ష్మణన్, దొరై, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై నిల్వచేరిన మురుగునీరు



రేణిగుంట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కరకంబాడి పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ప్రధాన రోడ్డు వద్ద కాల్వ ధ్వంసం కావడంతో వర్షపునీటితో కలిసి మురుగు నిల్వ చేరింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు ఎక్స్‌కవేటర్ సహాయంతో ఆ నీటిని చెరువుకు మళ్లించారు.

గుడ్లూరు పరిశ్రమకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు



చంద్రబాబుకు అభివాదం చేస్తున్న శంకర్‌రెడ్డి

రేణిగుంట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోనున్న ప్రముఖ చిన్న తరహా పరిశ్రమైన గుడ్లూరు ఇండస్ట్రీస్ స్వచ్ఛ ఆంధ్ర అవార్డును అందుకుంది. తిరుపతి జిల్లాలో 55వేలకుపైగా ఎంఎస్‌ఎంఈలలో గుడ్లూరు ఇండస్ట్రీస్ శుభ్రత, పర్యావరణం విధానంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఈ అవార్డుకు ఎంపికైంది. ఆ మేరకు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఈ అవార్డును పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ జగన్మోహన్ అందుకున్నారు.

సీఎంకు ఎమ్మెల్యే ఆదిమూలం వీడ్కోలు



నారాయణ వనం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు రంగంపేటలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఘనంగా వీడ్కోలు పలికారు. నారావారిపల్లెలో జరిగిన మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడి సంవత్సరీకం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సుమన్ నివాళులర్పించారు. అనంతరం రంగంపేట హెలిప్యాడ్ వద్ద సీఎంకు ఘనంగా వీడ్కోలు పలికారు.

సీఎంను కలిసిన శంకర్‌రెడ్డి



సత్యవేడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, తన తమ్ముడు రామ్మూర్తి నాయుడు వర్ధంతిలో పాల్గొనేందుకు మంగళవారం చంద్రగిరికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

బురదమయంగా గ్రామీణ వీధులు

సీసీరోడ్లు నిర్మించాలని గ్రామస్తుల వినతి



రామకృష్ణాపురం ఎస్టీకాలనీకి వెళ్లే దారి

కేవీబీపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తూరు, రామకృష్ణాపురం, రాగిగుంట, పెరిందేశం, కళత్తూరు గ్రామాల్లో ఇంకా మట్టిరోడ్లే ఉన్నాయి. వర్షం పడితే బురదమయంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కొన్ని గ్రామాలపైనే దృష్టి పెట్టి ఆ గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించారు. మిగిలిన గ్రామాల్లో రోడ్లు వేయక పోవడంతో నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బురదలోనే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ సమీక్ష

పిచ్చాటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో మంగళ వారం తహసీల్దార్ సుబ్రహ్మణ్యం రెవెన్యూ సమస్యలపై తమ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర పెండింగ్ పనులపై సమీక్షించారు. రైతుల సమస్యలను త్వరగా పూర్తి చేయాలన్నారు. మ్యుటేషన్లు, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్ల విషయంపై వివరాలు అందజేయాలని సిబ్బందికి సూచించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన వస్తువులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన ఆనంద్ ఇంట్లో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. పలు వస్తువులు కాలిపోయాయి. ఫ్రిజ్, ల్యాప్‌టాప్, టీవీ, దుస్తులు, బీరువాలో ఉన్న కొంత డబ్బులు కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు.

డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షా కాలంలో డయేరియా సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. కలుషిత నీరుతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు.

ఎన్నికల సంఘం అక్రమాలకు పాల్పడుతోంది

శ్రీకాళహస్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం విశాలాక్షినగర్‌లో మంగళవారం ఓట్ చోర్ గద్దిచోడ్‌పై ప్రజాభిప్రాయ సంతకాల సేకరణను కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వ యకర్త దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎన్నికల కమిషన్ అవక తవకలకు పాల్పడుతోందన్నారు. రాజ్యాగం కల్పించిన ఓటు హక్కును నేడు ప్రజలు వినియో గించు కోలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, ఆంటోని, బద్రి, మహేష్, తరున్, అరుణ్, చంద్రు, ప్రశాంత్ పాల్గొన్నారు.

గాయపడ్డ ద్విచక్రవాహనదారుడు 108 కోసం నిరీక్షణ

పిచ్చాటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి -చెన్నై జాతీయ రహ దారిపై నీరువాయి సర్కిల్ వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడ్డ ద్విచక్ర వాహనదారుడుని 108లో తరలించడం కోసం గంటల తరబడి నిరీక్షించినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులు ప్రైవేటు వాహనంలో నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నింద్ర యానాది కాలనీకి చెందిన శరత్(32) నాగలాపురంలో పని చూసుకుని నింద్రకు మోటారు సైకిల్‌పై వస్తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న ఓ వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. 108 ఎంతకీ రాకపోవడంతో పోలీసులు ప్రైవేటు వాహనంలో తరలించారు.

జీఎస్టీపై వ్యాసరచన పోటీలు

ఏర్పేడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యాసాశ్రమంలోని ఎస్వీ హైస్కూల్‌లో మంగళవారం జీఎస్టీపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 10వ తరగతికి చెందిన మేఘన, విష్ణుప్రియ ప్రథమ, ద్వితీయ స్థానం సాధించారు. 9వ తరగతి చదువుతున్న పల్లవికి తృతీయస్థానం లభించింది. ఇక చెంచుకీర్తి, గాయత్రి, శ్రావణి అనే ముగ్గురు విద్యార్థినులు డిబెట్‌లో ఉత్తీర్ణులయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.